# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 29-12-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

❖ "ఏక్ భారత్.. శ్రేష్ఠ్ భారత్" భావనను భారతీయ వినోద పరిశ్రమ మరింత బలపరుస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.

❖ విద్యార్ధులకు నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందించడంపై ప్రత్యేక దృష్ట పెడుతున్నామని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజ నేయస్వామి తెలిపారు.

❖ చిరు వ్యాపారులు పిఎం స్వనిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర ఆయుష్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ప్రతాప్ రావ్ జయదేవ్ ఆకాంక్షించారు.

❖ కోర్టు తీర్పులు తెలుగులో ఉంటే పారదర్శకత పెరుగుతుందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు అన్నారు.

==================================

రాజ్యాంగ నిర్మాతలు మనకు అందజేసిన భారత రాజ్యాంగం కాలపరీక్షలకు నిలిచిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఈరోజు ఆకాశవాణి ద్వారా ప్రసారం అయ్యే "మన్ కీ బాత్ మనసులోని మాట" కార్యక్రమం 117వ సంచిక ద్వారా దేశ, విదేశాలలోని భారతీయ పౌరులతో ప్రధానమంత్రి తన మనసులోని మాటను పంచుకున్నారు. దేశ పౌరులను రాజ్యాంగ వారసత్వంతో అనుసంధానం చేసి ప్రత్యేక వెబ్‌సైట్ constitution75.comను ప్రతీ ఒక్కరూ సందర్శించిన అందులోని భాగస్వాములు కావాలని కోరారు. సృజనాత్మక యానిమేషన్ చిత్రాలు భారతీయ సినీ పరిశ్రమ "ఏక్ భారత్.. శ్రేష్ఠ్ భారత్" భావనను మరింత బలపరుస్తున్నాయని ప్రధానమంత్రి వినోధన పరిశ్రమను అభినందిస్తూ....

(వాయిస్ 40 సెకన్లు)

అలాగే శత జయంతి జరుపుకుంటున్న సినీ ప్రముఖుల గురించి ప్రస్తావిస్తూ... నటసామ్రాట్ అక్కినే నాగేశ్వరరావు చిత్రాలు తెలుగు సినీ పరిశ్రమకు స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు.

==================================

ఎన్డీయే కూటమి పాలనలో సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలు అభివృద్ధి చేస్తున్నామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజ నేయస్వామి అన్నారు. ప్రకాశం జిల్లా సింగరాయకొండలోని ఎస్సీ, బీసీ వసతి గృహాలను ఈ రోజు మంత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మునుపెన్నడూ లేని విధంగా 143 కోట్ల రూపాయలతో హాస్టళ్లలో మరమ్మతులు చేస్తున్నామన్నారు. 206 కోట్ల రూపాయలతో 62 నూతన హాస్టళ్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. భీమ్ ప్రాజెక్టుతో గురుకులాల్లో విద్యార్థులకు అత్యుత్తమ వైద్యం అందిస్తున్నామన్నారు. గురుకులాల్లో 15 రకాల పరికరాలతో వైద్య కిట్ లు అందుబాటులోకి తెస్తున్నామని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని మంత్రి తెలియజేశారు.

==================================

2047 సంవత్సరానికి వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ పని చేస్తున్నారని కేంద్ర ఆయుష్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ప్రతాప్ రావ్ జయదేవ్ అన్నారు. ఈ రోజు తిరుపతిలోని కలెక్టర్ కార్యాలయంలో భారత ప్రభుత్వ ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ఆహార భద్రతా ప్రమాణాల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఆహార భద్రత, ప్రమాణాలపై తినుబండారాల చిరువ్యాపారులు, వీధి వ్యాపారులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పాల్గొని ఆహార భద్రత, ప్రమాణాలపై పలు సూచనలు చేశారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... "ఆత్మ నిర్భర్ భారత్" ద్వారా తిను బండారాలు అమ్మే చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులు "పిఎం స్వనిధి పథకా"న్ని వినియోగించుకుని స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని అన్నారు.

(వాయిస్ 35 సెకన్లు)

విరామం

==================================

ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థుల చదువును ఉపాధ్యాయులు గమనించాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈరోజు సంబంధిత అధికారులతో నిర్వహించిన శ్రవణమాధ్యమంలో కలెక్టర్ మాట్లాడుతూ... పదవ తరగతి ఉత్తీర్ణత శాతంలో రాష్ట్ర స్థాయిలో జిల్లాను తొలి స్థానంలో నిలపాలని కోరారు. కొద్ది నెలల్లో పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పరీక్షలు ప్రారంభమయ్యే వరకు ప్రతి విద్యార్థి పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యయులు చూడాలని పేర్కొన్నారు.

==================================

తెలుగు భాష అమల్లో లోపాలను సరిదిద్దుకుని ముందుకెళ్దామని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావు అన్నారు. అమ్మభాషను మాట్లాడదాం.. ఆత్మాభిమానం చాటుకుందామని ఆయన పిలుపునిచ్చారు. విజయవాడలో ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో రెండవ రోజు అయిన ఈరోజు నిర్వహించిన 'తెలుగులో న్యాయపాలన' సదస్సులో ఆయన మాట్లాడుతూ... తెలుగులో తీర్పులు ఇస్తేనే ప్రజలకు సులువుగా అర్థమవుతుంది. తీర్పు తెలుగులో ఉంటే మరింత పారదర్శకత ఉంటుందని జస్టిస్ మన్మథరావు పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

==================================

సంక్రాంతి పండగ సందర్భంగా ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ ఆర్టీసీ) ప్రత్యేక బస్సులను నడపనుంది. విశాఖపట్నం నుంచి దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల కోసం వెయ్యి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఈరోజు ప్రకటించింది. వీటిలో దూర ప్రాంతాలకు 200 సర్వీసులు.. విజయనగరం జోనల్ పరిధిలో 800 బస్సులు నడపనున్నామని వెల్లడించింది. విశాఖ నుంచి గరుడ, గరుడ ప్లస్, అమరావతి, నైట్ రైడర్, క్రూయిజ్, అల్ట్రా డీలక్స్ సర్వీస్‌లు దూర ప్రాంతాలకు నడపనున్నారు.

=================================

విశాఖలోని ప్రభుత్వ కింగ్ జార్జ్ ఆసుపత్రిలో అనేక ప్రాజెక్టులకు శ్రీకారం చుడుతున్నామని ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ పి.శివానంద తెలిపారు. గడిచిన ఆరు నెలల్లో చేసిన అభివృద్ధి, నూతన సంవత్సరంలో చేపట్టబోయే కొత్త ప్రాజెక్టులను ఆయన పాత్రికేయులకు వివరించారు. పవర్ గ్రిడ్ సంస్థ వారు ఇచ్చే కార్పొరేట్ సామాజిక బాధ్యత (CSR) నిధులు 35 కోట్ల రూపాయలతో కొత్త కాజువాలిటీ బ్లాక్ ను తీసుకురానున్నామని వెల్లడించారు. కాజువాలిటీ బ్లాక్, ఓపి బ్లాక్ లకు ఆనుకొని రోగులకు అందుబాటులో వుండేందుకు పక్కనే ఎక్స్ రే సేవల కోసం కొత్త ప్రాంగణం నిర్మిస్తున్నట్లు తెలిపారు. దీని కోసం పోర్ట్ ట్రస్ట్ అధారిటీ కోటి రూపాయల విరాళం అందిస్తోందని పేర్కొన్నారు.

=================================

అక్రమ బియ్యం రవాణా ఆరోపణలతో గత నెల 11వ తేదీ నుండి కాకినాడ పోర్టులో నిలిపి వేసిన స్టెల్లా నౌక నుంచి అధికారులు రేషన్ బియ్యాన్ని పూర్తిగా అన్‌లోడ్ చేశారు. ఈ నౌకలోని 1,320 టన్నుల రేషన్ బియ్యాన్ని రెండు బ్యార్జీల్లో ఒడ్డుకు చేర్చి పౌరసరఫరాల శాఖ అధికారులకు అప్పగించారు. ఈ బియ్యాన్ని యాంకరేజ్ పోర్టు గిడ్డంగిలో నిల్వ చేయనున్నారని తెలియజేశారు.

=================================

అనంతపురం జిల్లాలో ఈ సంవత్సరం మిస్సింగు కేసుల తగ్గుముఖం పట్టాయని జిల్లా పోలీసు సూపరింటెండెంట్ పి.జగదీశ్ తెలిపారు. ఈ రోజు ఎస్పీ కార్యాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... 2024లో జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ జిల్లా పోలీసులు సమర్ధవంతంగా విధులను నిర్వర్తించారని అన్నారు. 2025లో ఎదురయ్యే సవాళ్లను సమర్ధవంతంగా అధిగమించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

=================================
=================================